సాక్షి
హనుమకొండ
బుధవారం । 15 । మార్చి । 2023



బ్రిటిష్ వాల్యూస్ వర్సిటీతో...
బ్రిటిష్ వాల్యూస్ వర్సిటీతో హెల్త్ బీయింగ్ అండ్ ఇంక్లూసన్ రంగంలో అవగాహన ఒప్పం దానికి అంగీకారం కుదిరిందని కేయూ వీసీ తాటికొండ రమేశ్ తెలిపారు. - 8లో▸



వినియోగదారుడా మేలుకో..
కొనే ప్రతీ వస్తువు, సేవల్లోనూ లోపం లేకుం డా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారులపై ఉంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35.0^0 / 22.0^0
వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా, వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ధోబీ, టెక్నీషియన్ సస్పెన్షన్

ఎంజీఎం : బంధువు ఆత్మహత్య కేసులో రిమాండ్‌కు వెళ్లిన ఆస్పత్రి ధోబీ కృష్ణమూర్తిని ఎంజీఎం పరిపాలనాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. అదేవిధంగా అజంనగర్ పీహెచ్‌సీనుంచి ఎంజీఎంలో వర్క్ ఆర్డర్‌పై పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ పోచయ్య మరో కేసులో 72 గంటల పాటు రిమాండ్‌లో ఉన్నట్లు ప్రజారోగ్య సంచాలకులు లేఖలో తెలిపారని పేర్కొన్నారు. ఈ ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదు కావడంతో నిబంధనల మేరకు సస్పెండ్ చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

నేడు జాతీయ అప్రెంటిస్‌షిప్ సదస్సు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని ఎల్బీకాలేజీ సమీపంలోని సునీల్ గార్డెన్స్‌లో బుధవారం ఉదయం 10గంటలకు జాతీయ అప్రెంటిస్‌షిప్ అవగాహన సదస్సు–2023ను నిర్వహిస్తున్నట్లు వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ జుమ్లానాయక్, ఆర్‌డీడీ సీతారాములు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సదస్సులో ఉమ్మడి జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు పారిశ్రామిక యాజమాన్యాలు పాల్గొనాలని కోరారు.

కవులకు పుట్టినిల్లు ఓరుగల్లు



కాజీపేట అర్బన్: బమ్మెర, పోతన, దాశరథి వంటి కవులకు పుట్టినిల్లు ఓరుగల్లు అని వ్యంగ్య రచయిత, హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని రామకృష్ణ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మంగళవారం తెలంగాణ సామాజిక రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా శంకర్‌నారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కవులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ పావుశెట్టి శ్రీధర్, దేశబోయిన శ్రీనివాస్, పింగిలి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, రావుల రాజేశం, గోవర్ధన్‌రెడ్డి, వారణాసి అంజనీ శర్మ పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

ఎంజీఎం : హనుమకొండ కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం వైద్యారోగ్యశాఖాధికారులు స్టార్ స్కానింగ్ కేంద్రం, సృశిటి ఆస్పత్రుల్లో తనిఖీలు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకుబ్‌పాషా మాట్లాడుతూ గర్భిణులకు అనుమతించిన వైద్యులు మాత్రమే స్కానింగ్ చేయాలని, ఎంతమందికి స్కానింగ్‌పరీక్షలు నిర్వహించారో వివరాలను ఫారం–ఎఫ్‌లో పొందుపర్చాలన్నారు. డెమో అశోక్‌రెడ్డి, సీహెచ్‌ఓ మాధవరెడ్డి పాల్గొన్నారు.

శ్రీభద్రకాళికి ప్రావీణ్య, నైనా జైస్వాల్ పూజలు



హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి అమ్మవారిని మంగళవారం వరంగల్ జిల్లా నూతన కలెక్టర్ ప్రావీణ్య, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ శేషుభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆలయమర్యాదలతో స్వాగతించారు. మహామండపంలో తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు మహాదాశీర్వచనం అందజేశారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలి



హన్మకొండ: విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. వంశీరెడ్డి ఫౌండేషన్, ఇంపాక్ట్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన వ్యక్తిత్వ శిక్షణ శిబిరంలో బుధవారం లక్ష్మీనారాయణ మాట్లాడారు. విజయం సాధించాలంటే కంఫర్ట్ జోన్ నుంచి బయటపడాలన్నారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, కవి పోతనలాంటి వారు ఈ గడ్డనుంచి వచ్చిన వారేనన్నారు. మహనీయులనుంచి స్ఫూర్తి పొందాలన్నారు. టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, నైనా జైస్వాల్ మాట్లాడుతూ ఆశయాలుంటే అద్భుతాలు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వర్‌రావు, వ్యక్తిత్వవికాస నిపుణుడు శ్రీపాదరావు, వేణు, వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స ప్రసంగించారు. నిర్వాహకులు కంచరకుంట్ల మురళీధర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉదయం 9 దాటితే నో ఎంట్రీ..



నేటినుంచి ఇంటర్‌మీడియట్ పరీక్షలు
- సెంటర్ల వద్ద 114 సెక్షన్, జిరాక్స్ సెంటర్ల మూసివేత
- రెండు ఫ్లయింగ్, మూడు సిట్టింగ్ స్క్వాడ్లు

కేంద్రాలు, విద్యార్థులు ఇలా..
హనుమకొండ

మొదటి సంవత్సరం
- జనరల్ 17,626
- ఒకేషనల్ 1004
- మొత్తం 18,630
- సెంటర్లు 49
- చీఫ్ సూపరింటెండెంట్లు 49

ద్వితీయ సంవత్సరం
- జనరల్ 15,522
- ఒకేషనల్ 990
- మొత్తం 16,512
- డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు 49
- ఇన్విజిలేటర్లు 980

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు హనుమకొండ జిల్లాలో అధికారులు సర్వసిద్ధం చేశారు. బుధవారం నుంచి ప్రథమ సంవత్సరం, 16నుంచి సెకండియర్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ మూడవ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఫస్టియర్, సెకండియర్ కలిపి మొత్తంగా 35,142మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటలు దాటితే కేంద్రాల్లోకి అనుమతించబోరు. ఈ మేరకు నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించారు. వీరికి అదనంగా 36 ప్రైవేట్ పరీక్ష కేంద్రాల్లో మరో 36మంది అదనపు చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. 10మంది కస్టోడియన్‌లను నియమించారు. ఇన్విజిలేటర్లు తక్కువుంటే ప్రభుత్వ స్కూళ్ల ఎస్‌జీటీ టీచర్లను కూడా విధుల్లోకి తీసుకోవచ్చునని ఆదేశాలు జారీ చేశారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయి. 30 నిమిషాల ముందు నుంచే కేంద్రాల్లోనికి అనుమతిస్తారు.
- ఫీజులు చెల్లించలేదనే సాకుతో ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకపోతే నేరుగా సంబంధిత వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. వాటిని కూడా అనుమతిస్తారు.
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పోలీసులు బందోబస్తుగా ఉంటారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్‌సెంటర్లను మూసివేయాలి.
- పరీక్ష సమయానుకూలంగా వివిధ రూట్లలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది.
- విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు సెంటర్లలోకి తీసుకురాకూడదు.

అడుగడుగునా నిఘా..
చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షకు 15నిమిషాలముందు ప్రశ్నపత్రాల బండిల్‌ను సీసీ కెమెరా నిఘాలోనే విప్పాల్సింటుంది. పరీక్ష ముగిశాక జవాబపత్రాల బండిల్స్‌ను సీసీ కెమెరాల నిఘాలోనే కట్టాల్సింటుంది.

- పరీక్షల్లో కాపీయింగ్ నిరోధానికి సిట్టింగ్ స్క్వాడ్లు మూడు, ఫ్లయింగ్ స్క్వాడ్లు రెండు బృందాలు ఉంటాయి. అదేవిధంగా డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటీ కూడా ఉంటుంది. పరీక్షల నిర్వహణతీరును హైపవర్ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఇందులో చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ ఉంటారు.

పకడ్బందీగా పరీక్షలు



హనుమకొండ జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థులు కేంద్రాలకు కనీసం అర్థగంటముందుగానే చేరుకోవాలి. ఒకరోజు ముందు కేంద్రాలను సరిచూసుకోవడం మంచిది. కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటారు.
– హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్



హనుమకొండ ప్రభుత్వ కాలేజీలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

డీఐఈఓ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్
ఇంటర్మీడియట్ పరీక్షల విషయంలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా పరిష్కరించేందుకు హనుమకొండ డీఐఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు.
సుచరిత - 9966440775
వికాస్ - 9502743435
అందుబాటులో ఉంటారని, వీరిని ఫోన్‌లో సంప్రదించవచ్చునని డీఐఈఓ గోపాల్ తెలిపారు.

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి

జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు



గూడూరులో టీబీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కమలాపూర్: టీబీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు సూచించారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా కమలాపూర్ మండలం గూడూరు, భీంపల్లి గ్రామాల్లోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ పల్లె దవాఖానాల్లో 'అవును.. మనం టీబీని అంతం చేయగలం'అనే నినాదంతో నిక్షయ్ దివాస్ ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలన దిశగా కృషి చేయాలని కోరారు. టీబీ కోఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సబ్ సెంటర్‌లో వెయ్యి మంది జనాభాకు ముగ్గురు టీబీ రోగులను గుర్తించాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా రెండు వారాలనుంచి ఎడతెరిపి లేని దగ్గు, దగ్గినప్పుడు తెమడలో రక్తం పడడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, ఆకలి మందగించడం, బలహీనం, అలసట అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే వారు వెంటనే స్థానిక హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిక్షయ్ దివాస్ కార్యక్రమాన్ని ప్రతినెలా పీహెచ్‌సీల్లో నిర్వహించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు అంకతి సాంబయ్య, జవ్వాజి పద్మ, వైద్యాధికారులు డాక్టర్ హర్షిణిప్రియ, పంచాయతీ కార్యదర్శి స్వప్న, హెల్త్ సూపర్‌వైజర్ విప్లవ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్లు చంద్రమౌళి, ప్రశాంత్, ఏఎన్‌ఎంలు జ్యోతి, లావణ్య, ఇందిరా ప్రియదర్శిని, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి



ఆత్మకూరు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

ఆత్మకూరు: ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మహిళ కార్యక్రమంలో 8 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రతి మహిళ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్ పాష, కంటి వెలుగు పీఓ రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, డాక్టర్ స్పందన, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఈ–నామ్‌ను పరిశీలించిన పరకాల మార్కెట్ ప్రతినిధులు



పత్తి యార్డులో పరిశీలిస్తున్న పరకాల, ఖమ్మం మార్కెట్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: స్టడీ టూర్‌లో భాగంగా హనుమకొండ జిల్లా పరకాల వ్యవసాయ మార్కెట్ ప్రతినిధులు మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఈ–నామ్ విధానంలో పంటల క్రయవిక్రయాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఖమ్మం మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశంతో పాటు పరకాల మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, వైస్ చైర్మన్ నందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను జాగృత పర్చడానికే పాదయాత్ర

హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: కేసీఆర్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ.. ప్రజలను జాగృతపర్చడానికే పాదయాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం హనుమకొండలోని ఎస్‌వీకాలనీ, చోటే మజీద్, సుబేదారి, కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీ, అలీపుర, హౌసింగ్ బోర్డు, నక్కలగుట్టలో పాదయాత్ర చేశారు. ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు వివరించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. వరంగల్ నగరాన్ని వాషింగ్టన్ చేస్తామంటూ కేసీఆర్ ఇచ్చిన ఏమైందని ప్రశ్నించారు. స్మార్ట్ సిటీ పనులు మధ్యలోనే ఆగాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, కార్పొరేటర్ తోట వెంకన్న, నాయకులు కొండా నాగరాజు, నాయిని లక్ష్మారెడ్డి, తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి, సాయిరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ!
దద్దరిల్లిన విద్యుత్ భవన్
పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ ర్యాలీ
దత్తత గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి - 10లో▸

రుద్రమ రాజ్యంలో...

- ఓరుగల్లు గడ్డపై అతివల పాలన
- హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య
- కీలక స్థానాల్లో కొలువుదీరి తమదైన ముద్ర
- మహిళా అధికారులుగా ప్రజలతో మమేకం

నాటి ప్రజలకు జనరంజకమైన పాలన అందించి చరిత్ర పుటల్లోకి ఎక్కారు. తరాలు చెప్పుకునే ఆనవాళ్లను కళ్ల ముందు నిలిపిన రాణి రుద్రమదేవి ఏలిన గడ్డపైనే ప్రస్తుతం అతివలు రాజ్యమేలుతున్నారు. ఉన్నత స్థానాల్లో కొలువుదీరి ప్రజలకు పారదర్శకమైన పరిపాలన అందిస్తున్నారు. ట్రైసిటీ పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లుగా వచ్చిన మహిళలే తమదైన ముద్ర వేసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెవెన్యూ, పోలీసు సహా పలు ప్రధాన శాఖల్లో మహిళలే కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తులు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఇలా.. ప్రధాన స్థానాల్లో అతివలే ఎక్కువ శాతం ఉన్నారు. తమదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారు.
– సాక్షిప్రతినిధి, వరంగల్

కె.రాధాదేవి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, వరంగల్



జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కె.రాధాదేవి ఉన్నారు. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. గతంలో వరంగల్ సీనియర్ సివిల్ జడ్జిగా పని చేసిన న్యాయమూర్తి.. హైదరాబాద్‌లో కూడా వివిధ స్థాయిల్లో పని చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు 2022 మేలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో 14,289 కేసులను పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించారు.

సిక్తా పట్నాయక్, ఐఏఎస్, హనుమకొండ కలెక్టర్



ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ఇటీవల బదిలీపై హనుమకొండ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన సిక్తా పట్నాయక్ పాలనలో దూకుడు పెంచారు. ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన సిక్తా పట్నాయక్ 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. నల్లగొండ అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ పొందిన ఆమె బోధన్ సబ్ కలెక్టర్‌గా, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా, పెద్దపల్లి కలెక్టర్‌గా పని చేశారు. ఆదిలాబాద్‌లో మహిళాభివృద్ధి, బాలల సంక్షేమంతోపాటు ఏజెన్సీ వాసులకు అండగా నిలిచారు.

పి.ప్రావీణ్య, ఐఏఎస్, కలెక్టర్, వరంగల్



ఐఏఎస్ అధికారిణి పి.ప్రావీణ్య వరంగల్ జిల్లా కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐఏఎస్ అధికారిణి పి.ప్రావీణ్య 2021 ఆగస్టులో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. కర్ణాటకకు చెందిన ప్రావీణ్య 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. జీడబ్ల్యూఎంసీ అడిషనల్ కమిషనర్‌గా, కరీంనగర్ స్పెషలాఫీసర్‌గా పనిచేశారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి 18 నెలలు పనిచేశారు. కుడా వైస్ చైర్మన్‌గా కూడా ఉన్న ఆమె నగర సుందరీకరణలో తనవంతు పాత్ర పోషించి ఇప్పుడు వరంగల్ జిల్లా కలెక్టర్ అయ్యారు.

అశ్విని తానాజీ వాకడే, ఐఏఎస్, వరంగల్ అదనపు కలెక్టర్



వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా తొలిసారిగా ఐఏఎస్ అధికారిణి అశ్విని తానాజీ వాకడే ఇటీవల బాధ్యతలు చేపట్టారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె.. ఐఏఎస్ కాకముందు కొంతకాలం మహారాష్ట్రలో వైద్యాధికారిగా పనిచేశారు. వరంగల్ జిల్లా పరిధిలో ఎక్కువ శాతం గ్రామాలు ఉండగా.. పురపాలక సంస్థలు, గ్రేటర్ వరంగల్ మరికొంత భాగం ఉంటుంది. వరంగల్ జిల్లాలో వైద్యంపై ఆమె మరింత ఫోకస్ పెట్టారు.

సింధు శర్మ, ఐపీఎస్, కమాండెంట్, టీఎస్‌ఎస్‌పీ నాలుగో బెటాలియన్



సింధు శర్మ 2014 యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారి. ఆమె జగిత్యాల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా పని చేశారు. ప్రస్తుతం మామునూరు పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్నారు. జగిత్యాల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి మంచి ఆఫీసర్‌గా సింధు శర్మ పేరు తెచ్చుకున్నారు. సింధు శర్మ భర్త మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ శశాంక కొండూర్.

ఇంజారపు పూజ, నాన్ కేడర్ ఎస్పీ, పీటీసీ, వరంగల్



వరంగల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్(నాన్ కేడర్ ఎస్పీ)గా ఇంజారపు పూజ ఉన్నారు. ఏపీ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన పూజ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని పోలీసు అధికారిగా నిలదొక్కుకున్నారు. 2010 గ్రూప్ వన్ బ్యాచ్‌కు చెందిన ఈమె.. గ్రూప్స్‌కు ముందు బ్యాంకింగ్‌లోనూ, ఉపాధ్యాయురాలిగా పని చేశారు. అంచెలంచెలుగా ఎదిగి నాన్ కేడర్ ఎస్పీగా ఉన్న పూజ భర్త దాసరి మురళీధర్ వరంగల్ కమిషనరేట్‌లో క్రైం డీసీపీగా పని చేస్తున్నారు.

జి.సంధ్యారాణి, అదనపు కలెక్టర్, హనుమకొండ



జి.సంధ్యారాణి 2021 మే నెలలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అదనపు కలెక్టర్‌గా పని చేయగా.. ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సంధ్యారాణిని హనుమకొండ జిల్లాకు కేటాయించారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆమె అభివృద్ధి పథకాల అమలుపై ఫోకస్ పెట్టారు.

కె.పుష్ప, డీసీపీ, పోలీస్ కమిషనరేట్, వరంగల్



వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో అడిషనల్ డీసీపీగా కె.పుష్ప విధులు నిర్వహిస్తున్నారు. 2013 గ్రూప్–1 అధికారి పుష్ప శిక్షణ తర్వాత సీఐడీలో పనిచేశారు. కల్వకుర్తి ఎస్డీపీఓ గా కూడా పని చేశారు. హైదరాబాద్‌లోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీగా పని చేశారు. బదిలీపై వరంగల్ అడిషనల్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆమె సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

సబిత, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి, హనుమకొండ



ఏపీపీఎస్సీ ద్వారా 1990లో గ్రేడ్–1 సూపర్‌వైజర్‌గా ఉద్యోగం సాధించిన సబిత.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ సీడీపీఓగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత అర్బన్ జిల్లా సీడీపీఓగా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పీడీగా, 2016లో వరంగల్ రూరల్ జిల్లా అధికారిగా, 2019లో ఖమ్మం జిల్లా అధికారిగా, మహబూబాబాద్ జిల్లాలో ఏడాదిపాటు పనిచేశారు. ఆ తర్వాత బదిలీపై హనుమకొండ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారిగా సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆర్.సునీత, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ, హనుమకొండ



వరంగల్ ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా సునీత కొనసాగుతున్నారు. ఐదేళ్లపాటు భద్రకాళి దేవాలయ కార్యనిర్వహణాధికారిణిగా ఆమె పనిచేశారు. దేవాదాయ శాఖపై ఆమెకు పూర్తిస్థాయి అనుభవం ఉండగా.. మేడారం కొత్తకొండ జాతరలో పనిచేసిన అనుభవం కూడా ఉంది. అనంతరం ఆమెను అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.


వినియోగదారుడా మేలుకో..


వినియోగదారుల సమాచార కేంద్రం ఇన్‌చార్జ్ సుధాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న చిట్‌ఫండ్ బాధితుడు సురేశ్ (ఫైల్)


వినియోగదారుల సమాచార కేంద్రంలో ఫిర్యాదుతో నష్టపరిహారం చెక్కులు అందుకున్న రైతులతో డీసీఐసీ ఇన్‌చార్జ్ సుధాకర్(ఫైల్)

- వస్తు సేవల్లో మోసాలపై జాగ్రత్త అవసరం
- కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తత తప్పనిసరి
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

తొర్రూరు/ఖిలావరంగల్: కొనే ప్రతీ వస్తువు, సేవల్లో లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉంది. కానీ.. ప్రస్తుతం మోసాలు ఎక్కువయ్యాయి. చివరికి తాగే పాలు, నీళ్లలో కూడా నాణ్యత లోపిస్తోంది. తూకాల్లో భారీగా తేడాలుంటున్నాయి. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే, నిలదీస్తే తప్ప న్యాయం జరగట్లేదు. ఈతరహా మోసాల్ని అరికట్టాలంటే వినియోగదారులు మేల్కొనాల్సిన అవసరం ఉంది. హక్కులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముంది. వినియోగదారులు మోసపోకుండా అండగా.. వినియోగదారుల రక్షణ చట్టం ఉంది. 1986 నుంచి ఇది అమల్లో ఉండగా.. 2019లో మెరుగులు దిద్దారు. ఈ చట్టంపై ప్రజల్లో ఇంకా అవగాహన కల్పించాల్సిన అవసరముంది.



బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

ఫిర్యాదు ఎక్కడ చేయాలి?

- వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒకటే ఉంది.
- నేరుగా ఫోన్‌లో ఫిర్యాదు చేసే వీలు లేదు.
- హనుమకొండ సుబేదారిలోని స్పెన్సార్ మాల్ పక్క వీధిలో కమిషన్ కార్యాలయం ఉంది.
- కమిషన్ కార్యాలయంలో వినియోగదారులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. సంబంధిత రసీదు, ఇతర ఆధారాలతో ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుంది.
- దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ 180042 500333కు ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవచ్చు.

ఫిర్యాదు ఎలా చేయాలి?

ఫిర్యాదు చేసే విధానం చాలా సులభం. అలాగే దానిపై స్పందన కూడా త్వరగా ఉంటుంది. తెల్ల కాగితంపై ఫిర్యాదు వివరాలు రాసి పంపవచ్చు. న్యాయవాది అవసరం లేదు. ఫిర్యాదుదారుడైనా, అతడి ఏజెంటైనా ఫోరంలో స్వయంగా ఫిర్యాదు చేయవచ్చు. అలా వీలు కాకపోతే పోస్టు ద్వారా కూడా పంపే వీలుంది.

పరిహారం బట్టి ఫోరం..

- రూ.20 లక్షల వరకు జిల్లా ఫోరంలో ఫిర్యాదు చేయాలి.
- రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రాష్ట్ర కమిషన్‌లో..
- రూ.కోటి మించిన పక్షంలో జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలి.
- కొనుగోలు చేసినా లేదా.. నష్టం జరిగిన నాటి నుంచి రెండేళ్లలోపు ఫిర్యాదు చేయవచ్చు. ఆలస్యానికి తగిన కారణం చూపిస్తే ఆపై సంవత్సరం కూడా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్నించారు.. పరిహారం పొందారు

- మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరుకు చెందిన రైతు రావుల రాంరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో ఓ కంపెనీకి చెందిన ఆడమగ వరి విత్తనాలు వేశాడు. అవి నాసిరకం కావడంతో పంట పూర్తిగా పోయింది. కంపెనీ ప్రతినిధులు స్పందించకపోవడంతో వినియోగదారుల సమాచార కేంద్రాన్ని ఆశ్రయించాడు. బాధిత రైతుకు ఆకంపెనీ రూ.5.60 లక్షల నష్ట పరిహారాన్ని చెల్లించింది.
- నర్సింహులపేటకు చెందిన రైతు నరసింహారెడ్డి, దాట్ల గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి కూడా ఇలాంటి కంపెనీల నుంచి రూ.7 లక్షల నష్ట పరిహారం పొందారు.
- తొర్రూరు పట్టణానికి చెందిన పండె బోయిన సురేశ్ ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీలో చిట్ వేశారు. కాల పరిమితి పూర్తయినా.. డబ్బులు చెల్లించకపోవడంతో ఆయన వినియోగదారుల సమాచార కేంద్రాన్ని ఆశ్రయించారు. సదరు చిట్‌ఫండ్ సంస్థకు నోటీసులు అందించి చిట్టి డబ్బులు రూ.5లక్షలు ఇప్పించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు.
- వరంగల్ గిర్మాజీపేటకు చెందిన శ్రీనివాస్ ఆన్‌లైన్‌లో ఓ ప్రముఖ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్ ఆర్డర్ చేశాడు. కొరియర్‌లో ఇంటికి వచ్చిన బాక్స్‌ను తెరిచి చూడగా.. అందులో రెండు కర్ర చెక్కలు ఉన్నాయి. కొరియర్ బాయ్‌ని నిలదీస్తే శ్రీనివాస్‌పై గొడవకు దిగాడు. ఏమీ చేయలేక వరంగల్ వినియోగదారుల సమాఖ్యకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. సమాఖ్య న్యాయవాది ద్వారా బాధితుడికి తిరిగి డబ్బులు వచ్చేలా పరిష్కారం చూపింది.
- వరంగల్ జిల్లా వినియోగదారుల ఫోరంలో నాలుగు ఏళ్లల్లో వరంగల్ నగరపాలక సంస్థ, రెవెన్యూ శాఖలు, నగర ప్రైవేట్ ఆస్పత్రులపై బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల పక్షాన సమాఖ్య న్యాయవాది ఆనందరావు ద్వారా 146 కేసులు ఫైల్ చేసి న్యాయస్థానం నుంచి పరిహారం ఇప్పించారు. ఇటీవల ఓ ఆర్థోపెడిక్ వైద్యశాలకు వ్యతిరేకంగా తీర్పు రాగా.. వినియోదారుడికి రూ.7.50 లక్షల పరిహారం అందజేశారు.

వినియోగదారుల్ని చైతన్యవంతుల్ని చేయాలి..



వినియోగదారుల చట్టం విషయంలో ప్రజల్ని చైతన్య వంతుల్ని చేయాలి. వస్తువు నాణ్యత, కొనుగోళ్లకు సంబంధించిన జాగ్రత్తలు, సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలి. హక్కుల రక్షణ చట్టాలపై ముందుగా ప్రజల్లో అవగాన కల్పించాలి. దీని కోసం ప్రభుత్వం అధికంగా నిధులు వెచ్చించాలి.

- మొగిలిచెర్ల సుదర్శన్, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు

అవగాహన అవసరం

కొనుగోళ్ల సమయంలో వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలి. ఏ వస్తువు, సరుకులు కొనుగోలు చేసినా విధిగా రసీదు తీసుకోవాలి. అన్యాయం జరిగితే నష్టం పరిహారం, న్యాయం పొందడానికి ఈ రసీదు ద్వారా హక్కు లభిస్తుంది. బాధితులు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే వినియోగదారుల సమాచారం కేంద్రం ద్వారా న్యాయం లభిస్తుంది.

- వింజమూరి సుధాకర్, వినియోగదారుల సమాచార కేంద్రం, మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్

క్లుప్తంగా

జూ పార్కుకు కొండ గొర్రె

వెంకటాపురం(కె)/వాజేడు: అడవి నుంచి జనావాసంలోకి వచ్చిన కొండగొర్రెను మంగళవారం అటవీశాఖ అధికారులు వరంగల్ జూ పార్కుకు తరలిచారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలం గంగారంలో సోమవారం సాయంత్రం మేకల మందతో కలిసి ఓ కొండగొర్రె పిల్ల వచ్చింది. మేకల కాపరి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. సమాచారం తెలుసుకున్న అధికారులు గంగారం గ్రామానికి వెళ్లి కొండగొర్రె పిల్లను స్వాధీనం చేసుకొని వెంకటాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. అక్కడి నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరంగల్ జూపార్కుకు తరలించారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది దేవయ్య, ప్రణవి తదితరులు ఉన్నారు.

వరంగల్ కలెక్టర్‌ను కలిసిన డీఎంహెచ్‌ఓ



గీసుకొండ: వరంగల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రావీణ్యను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ, వైద్యాధికారులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో అమలవుతున్న కంటి వెలుగు కార్యక్రమం గురించి ఆమెకు వివరించారు. అనంతరం అదనపు పౌరసంబంధాల అధికారి బి.ప్రేమలతకు కంటి అద్దాలు ఇవ్వగా.. వాటిని కలెక్టర్ ఆమెకు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కోట శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ప్రతాపగిరి ప్రసాద్, డీపీఓ అర్చన తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనకు వెళ్లిన విద్యార్థులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని మాథ్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధి అవగాహన క్షేత్ర పర్యటనకు వరంగల్ నిట్‌కు వెళ్లారు. విద్యార్థులకు క్షేత పర్యటన ప్రారంభ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడారు. కొత్త విషయాలను నేర్చుకోవడానికి క్షేత్ర పర్యటనకు వెళ్లటం మంచిదన్నారు. మ్యాథ్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ అంజన్‌రావు, నాగయ్య, రవికుమార్, శ్రీధర్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయం కోసం వెళ్తే పోలీసులే వేధిస్తున్నారు

- భూమి ఇప్పించకుంటే ఆత్మహత్యలే శరణ్యం


మాట్లాడుతున్న బాధితులు

రఘునాథపల్లి: తండ్రి నుంచి న్యాయపరంగా తమకు రావాల్సిన భూమిని ఇప్పించకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని, ఈవిషయంలో న్యాయం చేయాల్సిన పోలీసులే తమను వేధిస్తున్నారని బాధితులు విలేకరుల ఎదుట మంగళవారం గోడు వెళ్లబోసుకున్నారు. మండలంలోని కంచనపల్లికి చెందిన బుస్సారి మోహన్, తల్లి రుక్మీంద్రబాయి, అక్క స్నేహ మాట్లాడుతూ.. తమకు వారసత్వంగా వచ్చిన 18 ఎకరాల వ్యవసాయ భూమిలో 4 ఎకరాల భూమిని తమ మేనత్త ఇచ్చారని, మిగతా 14 ఎకరాల్లో తమకు తెలియకుండానే 11 ఎకరాల భూమిని తండ్రి బుస్సారి లక్ష్మణ్ అమ్ముకున్నట్లు తెలిపారు. మిగిలిన భూమి నుంచి కూడా ఎకరం భూమిని ఇటీవల ఇదే గ్రామానికి చెందిన హెండిగే ప్రదీప్‌కు అమ్ముకున్నాడని, ఈభూమి విషయంలో కోర్టుకు వెళ్లామన్నారు. కోర్టులో కేసు నడుస్తుండగా.. తమకు న్యాయం చేయాల్సిన పోలీసులు భూమిని వదిలిపెట్టాలంటూ బెదిరిస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజన్న

మామునూరు: పోషకాలు ఎక్కువగా నిలువ ఉండే చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజన్న సూచించారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా మంగళవారం మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ సౌజన్యంతో చిరుధాన్యాలపై ములుగు జిల్లా చిన్న గుంటూరుపల్లి గిరిజన రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రైతులు చిరుధాన్యాలు సాగు చేస్తే మంచి లాభాలు అందుకోవచ్చని సూచించారు. అనంతరం చిరుధాన్యాల సాగు విధానం, యాజమాన్య పద్ధతులపై రైతులకు డాక్టర్ అరుణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జయశంకర్, డాక్టర్ స్వర్ణ, డాక్టర్ రాజు అవగాహన కల్పించారు. ఈసమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శశాంక్, డాక్టర్ గణేశ్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పీజీ ఫస్ట్ సెమ్ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో పీజీ కోర్సుల ఆర్ట్స్, సోషల్ సైన్స్ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమైనట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఈనెల 25 వరకు కొనసాగుతాయని వారు తెలిపారు.

అతివేగంతో కాల్వలో పడిన ఆటో


జేసీబీతో ఆటోను బయటకు తీస్తున్న స్థానికులు

ఖానాపురం: అతి వేగంతో వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు కాల్వలో పడింది. గూడూరు మండలం భూపతిపేట శివారు కారంపాడి తండాకు చెందిన ఓ వ్యక్తితో పాటు మరొకరు ఆటోలో కొత్తగూడ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో అతివేగంగా వచ్చిన ఆటో ప్రమాదవశాత్తు అదుపుతప్పి పాకాల శివారులో సంగెం కాల్వలో పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్ప గాయాలవ్వగా.. ఆటో డ్రైవర్ స్థానికుల సాయంతో కాల్వలో పడిన ఆటోను జేసీబీ సాయంతో బయటకు తీయించాడు. పెనుప్రమాదం తప్పింది.

బ్రిటిష్ వాల్యూస్ వర్సిటీతో ఎంఓయూ

- కేయూ వీసీ ఆచార్య రమేశ్



మాట్లాడుతున్న వీసీ రమేశ్, పక్కన రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: గ్లోబల్ వాల్యూస్– తెలంగాణ భాగస్వామ్య ప్రాజెక్టులో భాగంగా ప్రతిష్టాత్మక బ్రిటిష్‌వాల్యూస్ గ్రూప్ ఆఫ్ యూనివర్సిటీస్‌లోని అబెర్వేత్స్ యూనివర్సిటీతో కేయూలోని బయోటెక్నాలజీ విభాగంలో హెల్త్ బీయింగ్ అండ్ ఇంక్లూసన్ రంగంలో అవగాహన ఒప్పందానికి అంగీకారం కుదిరిందని కేయూ వీసీ తాటికొండ రమేశ్ తెలిపారు. ఒక అంతర్జాతీయ యూనివర్సిటీతో కేయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే తొలిసారి అన్నారు. ఈమేరకు మంగళవారం క్యాంపస్‌లోని సెనెట్‌హాల్‌లో రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బ్రిటిష్‌వాల్యూస్ గ్రూప్ ఆఫ్ యూనివర్సిటీస్‌లోని ట్రినిటీ సేయింట్ డేవిడ్ యూనివర్సిటీ కూడా కేయూ సోషియాలజీ అండ్ సోషల్‌వర్క్, ఆంత్రోపాలజీ విభాగంతో తెలంగాణలోని మారుమూల గిరిజన జాతుల సంస్కృతివారసత్వానికి సంబంధించిన మరో అవగాహన ఒప్పందానికి అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా మొదటిదశలో తెలంగాణలో సంయుక్త కార్యశాలలు, రెండో దశలో బ్రిటన్‌లోని బ్రిటిష్ వాల్యూస్ గ్రూప్ ఆఫ్ యూనివర్సిటీస్‌లో కాన్ఫరెన్స్‌లు, మూడో దశలో పరిశోధనలు చేపట్టబోనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అవగాహన ఒప్పందానికి కృషి చేసిన బయోటెక్నాలజీ అడ్జెంక్ట్ ఆచార్యులు ఎ.సదానందం, ఎస్.రామస్వామిని ఈసందర్భంగా అభినందించారు.

17న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రాక

ఈ నెల 17న కాకతీయ యూనివర్సిటీకి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపెల్లి వినోద్‌కుమార్ రానున్నట్లు వీసీ తాటికొండ రమేశ్ తెలిపారు. ఈనెల 17న మధ్యాహ్నం 12 గంటలకు క్యాంపస్‌లోని సెనెట్‌హాల్‌లో నిర్వహించే సమావేశంలో 'చేంజింగ్ సినారియో ఆఫ్ ఫెడరలిజం' అంశంపై వారు ప్రసంగిస్తారని వెల్లడించారు. ఈఏడాది జూన్‌లో కేయూ దూరవిద్యాకేంద్రం, ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సంయుక్తంగా ప్రతిష్టాత్మక ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

పథకాల అమలులో అగ్రభాగాన నిలపాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, పక్కన అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ

వరంగల్ రూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లాను అగ్రభాగాన నిలపాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ మహేందర్ జీ, డీఆర్‌డీఓ సంపత్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్వసనీయత కోల్పోతున్న టీఎస్‌పీఎస్‌సీ


మాట్లాడుతున్న తిరునహరి శేషు

హన్మకొండ: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ప్రధాన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ అయిన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్‌సీ) అవినీతి, ప్రశ్నపత్రాల తయారీలో తప్పుల తడక, లీక్‌లతో తన విశ్వసనీయతను కోల్పోతుందని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు విమర్శించారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలో జరిగిన ప్రజా వేదిక జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిషన్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రవీణ్ ద్వారా అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఎగ్జామ్ పేపర్, గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పేపర్లతో పాటు ఇతర ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయనే ఆరోపణలతో నిరుద్యోగుల్లో అలజడి నెలకొందన్నారు. ఉద్యోగాల భర్తీ, నియామకాల పట్ల పారదర్శకంగా వ్యవహరించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

లీకుల, లిటికేషన్ల సర్కార్

కోటి ఆశలతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగుల ఆశలపై ప్రభుత్వ నిప్పులు చల్లిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కనీసం పేపర్ లీక్ కాకుండా పరీక్షలు నిర్వహించడం చేతగాని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. పథకం ప్రకారమే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి వాటిని రద్దు చేయడానికి అమలు చేసిన కుట్రలో భాగమే పేపర్ లీకలని ఆరోపించారు. బిడ్డను ఒక్కరోజు ఈడీ ప్రశ్నిస్తే కేసీఆర్ ఉక్కిరిబిక్కిరి అయ్యాడని, నీ బిడ్డ లాంటి బిడ్డలు ఈ నిరుద్యోగ బిడ్డలు కాదా? అని ప్రశ్నించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కాశిబుగ్గ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోని చైర్మన్ జనార్దన్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

బాలికపై కుక్కల దాడి

- జనగామ వీవర్స్‌కాలనీలో ఘటన
- మున్సిపల్ కమిషనర్‌పై జేఏసీ ఫిర్యాదు



కుక్కల దాడిలో గాయపడిన స్వరూప, కాలుకు అయిన గాయం

జనగామ: పట్టణంలో కుక్కల దాడిలో ఓ బాలిక తీవ్రంగా గాయపడింది. వ్యవసాయ క్షేత్రాలను ఆనుకొని ఉన్న 11, 12వ వార్డుల పరిధి ప్రజలు కుక్కలు, కోతులు బెడదతో నిత్యం భయంతో కాలం గడుపుతున్నారు. స్థానిక వీవర్స్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో చెన్నూరి రాజేశ్, రేఖ దంపతుల కూతురు స్వరూప నాలుగో తరగతి చదువుతోంది. రోజూమాదిరిగానే మంగళవారం స్కూల్‌కు వచ్చిన స్వరూప.. వాటర్ బాటిల్ కోసం మధ్యాహ్నం ఇంటికి వస్తుండగా వీధి కుక్కలు వెంబడించి దాడి చేశాయి. స్థానికులు చూసి కుక్కలను తరిమికొట్టడంతో ప్రాణపాయం తప్పినట్టయింది. కాలుకు తీవ్రంగా గాయమైన బాలికను వెంటనే స్థానిక గవర్నమెంట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స చేసి పంపించారు. ఇదిలా ఉండగా.. కుక్కలు, కోతుల బెడదను నివారించడంలో పూర్తిగా విఫలమైన మున్సిపల్ కమిషనర్ రజితపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జనగామ జేఏసీ కన్వీనర్ మంగళపల్లి రాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంట తుంగ కౌశిక్, కొండ్ర ప్రవీణ్, వెంపటి అజయ్, శ్రీనివాస్, బింగి నర్సింహులు, నర్సింగ్, అనిల్ చౌహాన్ ఉన్నారు.

ముప్పారంలో బాలుడిపై..


కుక్కల దాడిలో గాయపడిన రిత్విక్

ధర్మసాగర్: ముప్పారం గ్రామంలో ఓ బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఈ ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలుడు ఎతురాల రిత్విక్ సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటున్న సమయంలో అటుగా వచ్చిన వీధి కుక్కలు దాడి చేశాయి. గమనించిన తల్లి ఆ కుక్కలను తరమడంతో పెద్ద అపాయం తప్పింది. అప్పటికే గాయాలైన బాలుడికి స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం హనుకొండలోని ఓ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

గుండెపోటుతో రైతు మృతి


అజ్మీర వీరన్న

నర్సంపేట రూరల్: నర్సంపేట మండలం కమ్మపల్లిలోని చక్రంతండాలో మంగళవారం గుండెపోటుతో రైతు అజ్మీర వీరన్న(42) మృతి చెందాడు. వీరన్న తన కున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం లేచి చూసే సరికి వీరన్న విగత జీవిగా పడి ఉన్నాడు. గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువతి..

ఖానాపురం: తండ్రి మందలించడంతో యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దబ్బీర్‌పేట గ్రామానికి చెందిన రేగా సాధిక(18) ఏటూరు నాగారంలోని ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఈక్రమంలో ఈనెల 4న గ్రామంలోని ఒక ఫంక్షన్‌కు వెళ్లింది. డిగ్రీ ఎంట్రెన్స్ పరీక్ష ఉండగా.. నిర్లక్ష్యం చేస్తున్నావని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సాధిక మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. పురుగుల మందు తాగిన అనంతరం ఆవిషయాన్ని తన అమ్మమ్మ రమణమ్మకు చెప్పడంతో చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి సాంబయ్య ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.